# 36. దేనికైనా అర్హత ఉండాలి!

ప్రయత్నించినా ఒక్కొక్కప్పుడు ఫలం దక్కదంటారు. అలాంటిది ఏ పెద్దలు ఇచ్చిన ఆస్తో జత పడితే, అది కాస్త కాస్త దిగమింగుతూ ఎందరినైనా తిట్టి దిగజార బొయ్యొచ్చు. కనకం అలాగే చేస్తుంది కాబోలు అని చాలా రోజుల పాటు అనుకుంది కాంతం. నాన్న రోజూ చదివే భాగవతం బోరు భరించలేకే కనకం ఇంటికి వెళ్లేది కాంతం. కాని వెళ్ళిన చోటుకే రావలసి ఉంటుందనీ, అక్కడే తనకి శిక్షణా, రక్షణా లభిస్తాయనీ ఆమె ఎప్పుడూ వూహించలేదు.

కనకానిక్కూడా అలా ఆగకుండా మాట్లాడ్డం అలవాటు. అయితే కాంతానికి అది వినడంలో ఒక సుఖం కనపడింది. వినాలని రూలెక్కడా లేదు. తనలా కాకుండా మంచి కళ్ళు గల మొహం కనకానిది. ఆమె కళ్ళూ, మెడా, చేతులూ తిప్పుతూ ఎంత సేపు ఏం చెప్పినా ఆ అందాన్ని అలా రెప్ప వెయ్యకుండా చూస్తూ కూచోవచ్చు. అంతటి కళ్ళ వేడుక లభిస్తున్నప్పుడు ఏది వింటేయేం?

"మాట్లాడవేమే, కాంతం? మగాళ్ళంత స్వార్థ పరులూ, నమ్మక ద్రోహులూ మరొకరు భూమ్మీద ఉన్నారంటావా!" అని అప్పుడప్పుడు కనకం నిలదీసి అడుగుతూ ఉంటే 'అందుకు సందేహమా!' అనాలని ఉన్నా అలా అనేదాకా అయినా ఆగదు ఆమె.

ఇంతకీ ఆమె పురుష ద్వేషానికి అసలు కారణం ఆ తరవాత చెబితే తెలిసింది. కనకానికి అయిదారేళ్ళున్నప్పుడు వాళ్ళ నాన్న ఎదురింటి పంతులమ్మని తీసుకుని ఎక్కడికో లేచిపోయాడుట అప్పటికీ, ఇప్పటికీ అయిపు లేదట. అతన్ది అంతులేని ఆస్తి. అరాయించుకోలేక పరారీ అయితే దానికెవడు జవాబుదారీ?

"ఏ మొహం పెట్టుకు వస్తాడులే, నలుగురూ మొహం మీద ఉమ్మేస్తారని ఉండగా ఇలాంటి సిగ్గు మాలిన పని చేశాక! లక్షలు పట్టుకుని లక్ష్మీ దేవిలా వచ్చింది మా అమ్మ. వాడికెలా నచ్చుతుందిలే! 'చెప్పు తినెడి కుక్క చెరుకు తీపెరుగునా' అన్నారు. 'పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా' అన్నారు. స్త్రీ ఎంతటి శక్తి స్వరూపిణి, దాన్ని ఎక్కడ పెట్టుకుని ఎలాచూసుకోవాలి! ఆ మాత్రం జ్ఞానం లేని మగాళ్ళు కుక్కలూ పందులూనూ, ఏమే కాంతం?"

నిజానికి కాంతం ఆ క్షణాన చూస్తున్నది కనకం అందచందాలు కాదు, ఆమె కొత్తగా, ధరించిన ఆభరణాలు. అలా ఆలోచించగా ఆ తరువాత కాంతానికి ఒక కొత్త సత్యం స్ఫురించింది. తనని కనకం వైపు ఆకర్షిస్తున్నది ఆమె బంగారం లాంటి ఒంటితో పాటు ఒంటిమీద బంగారం కూడానని. గత అనుభవమే దానికి సాక్ష్యం. పొద్దుట వెళ్ళిన తనకి కాఫీ టిఫినూసరేసరి, భోజనం చేసి పెడితే కాని ఒక్కొక్కప్పుడు వదిలేదు కాదు కనకం. వెళ్ళినప్పుడు అదెప్పుడూ వట్టి చేతులతో ఇంటికి పంపదని పిన్నికి తెలుసు.

అంతకు ముందే జబ్బు పడిన కాంతం తండ్రి రిటైరు అయాక మరి మంచం దిగలేదు.

అంతకు ముందే పెళ్ళి చేసుకున్న అన్నయ్య ఆ సంగతి తెలిసి, ఆ గుమ్మం మరి తొక్కలేదు. ఇటు పెళ్ళి కావలసిన తనూ, అటు చదువులు పూర్తి కావలసిని తమ్ముళ్ళిద్దరూ. తన కుటుంబానికీ కనకం కుటుంబానికీ ఆర్థికంగా ఇంతటి దూరం. ఒక వయసూ, ఒక కులమూ కావచ్చు. ఈ పూరి గుడిసె పిల్లని ఆ మేడింటి చిన్నది ఆదరించిందంటే ఎంత మనసున్నదై ఉండాలి! తనని చూడందే కబుర్లు చెప్పందే ఒక్క రోజు ఉండలేదు. రాజకీయ, ఉపన్యాసాలు వినడానికి డబ్బిచ్చి పల్లెటూళ్ళ నుండి జనాల్ని లారీల మీద చేరుస్తారని ఎక్కడో చదివింది కాంతం. 'మీ పిల్లని చేసుకుంటాం మా కిస్తారా!' అని అటునుంచి ఎదురిచ్చి రోజుకో కబురు అందుకునే భాగ్యశాలి కనకం. ఈ జన్మకిక కల్యాణ యోగం లేదనుకునే అనాకారీ, దరిద్రగొట్టూ తను, శ్రోతని బుక్ చేసుకోవాలంటే తనకంటె బెటర్ కేండిడేట్ కనకానికి దొరకకనే పోయిందా!

ఏదో ఒక చోట చేరి రోజులు వెళ్ళబుచ్చుతున్నారు కాని, ఫండమెంటల్‌గా వారి వ్యక్తిత్వాలలో ఇంత తేడా ఉంది. చదువు బాగా వస్తున్నా, ఫీజులూ పుస్తకాల ఖర్చులూ కట్టుకోలేక కూచున్నది కాంతం. వచ్చేదాకా ఎంత పెద్ద చదువు చెప్పించే తాహతు అయినా వాళ్ళ వాళ్ళకుంది కాని, కనకానికి చదువబ్బక మానుకుంది. 'చదువురాని వాడివనీ దిగులు చెందకు' అనేది ఆమె కిష్టమైన పాట. 'ఈ చదువులు మా కొద్దు' అనే సినిమా పేరే ఆమెకి ప్రాణప్రదం. అలాగని అక్షరాలు వచ్చాక చదవకుండా ఉండలేదు కద! ఇప్పుడు బజార్లోకి ఏ నవల వచ్చినా కనకం కొని తెప్పిస్తుంది. ఇద్దరూ పోటీలు పడి చదువుతారు.

ఈ నవలలు చదివిన కొద్దీ జీవితానికి మరింత దగ్గరై, మగవారి పట్ల తన కసి కరెక్టే అనే అభిప్రాయం కలిగేది కనకానికి. ఇంచుమించు ప్రతి నవలకీ కేంద్రం ఆడదే. ఆమెకి జరిగిన అన్యాయమే. సృష్టిలో మగ జాతి వేరే ఉందనీ, వాడి బాధలూ, భ్రమలూ, బరువులూ వాడికీ ఉంటాయనీ, రెండు వైపులా ఆలోచించి చిత్రిస్తే కాని మానవ జీవిత సమగ్ర చిత్రణ కాబోదనీ మెజారిటీ తెలుగు రైటర్సు గుర్తించినట్టు కనపడదు. చదివి ఆలోచించినకొద్దీ కాంతానికి ఎన్నెన్నో ఇలాంటి చిత్రాలు కనపడుతున్నాయి. నవలా రచన కన్న ఇంటి స్త్రీ ఇండస్ట్రీ ఏముంది! అనే హాస్యం సత్యంగా రూపొందే ప్రమాదం కనబడుతూంది. మైనాలనందర్నీ మైనారిటీ వర్గం గానే గుర్తించి బస్సుల్లో, రైళ్ళలో రాయితీలుగా ప్రత్యేకించి సీట్లు కేటాయించినట్టు ప్రతి తెలుగు నవలలోనూ స్త్రీ పాత్ర మాత్రమే దోపిడీకి గురి అయినట్టు ప్రతి అక్షరం గుద్ది చెప్పబడుతూంది.

"చూశావటే, చూశావటే కాంతం, ఆడదానికి జరిగిన అన్యాయం మన తెలుగు నవలల్లో ఎంత బాగా బయట పడుతూందో!"

కాంతం గ్రహించింది వేరు కావచ్చు కాని కనకం చెప్పింది మాత్రం ఒక విధంగా కరెక్టే. ఆడదానికి తెలుగు నవలలు చేస్తున్న అన్యాయం మాత్రం ఇంతా, అంతా కాదు. చాలా మంది మగవాళ్ళు ఆడపేర్లు పెట్టుకుని రాయడం చేత గొప్పగా రాసే రచయిత్రుల్నికూడా పాఠకులు శంకించే దుఃస్థితికి చేరింది. చాలామంది ప్రసిద్ధ రచయిత్రులంతా మేలు జాతి మీసాల వారేనట! ఎందరో బృహన్నలలు!

ఎన్నో కథా బృహన్నవలలు!! పేజీకి ఇంతని పబ్లిషర్నుంచి డబ్బు రాబట్టే ఈ ఇటూ అటూ కానివాళ్ళా తమ రచనల ద్వారా పురుషాధిక్యం నుంచి స్త్రీకి రక్షణ కల్పించేది!

రాసిందే రాసి, చెప్పిందే చెప్పి, కొట్టిందే కొట్టిన రొడ్డ కొట్టుడు ఈ నవలలు. మంచి విశ్లేషణ లేదు కాని చాలావరకు తలనొప్పి కలిగించేవే కాంతం చురుకుదనానికి. ఒకసారి ఇంటికి నచ్చేసరికి నాన్న చదువుతున్న భాగవత పద్యపాదం ఆవిడ చెవిన పడింది.

**సిగ్గు పడుట కల్గి, సింగారమును కల్గి,**
**సీత రాము వశము సేసికొనియె!**

అందులో సున్నిత భావానికి ఆమె ముగ్ధురాలైంది. నాన్న చేతిలో పుస్తకాన్ని ఎగరేసుకు పోయి, పెరట్లో మంచం మీద పడుకుని గుండె మీద అదిమి పెట్టుకుని పులకించి పోయింది.

ఇంకోసారి సుందరకాండ పారాయణ చేసే తండ్రిని 'రోజా ఎందుకు నాన్నా చదివిందే చదువుతావ్?' అని ప్రశ్నించింది.

"మనం చేయవలసిందేమిటో మరిచి పోతే గుర్తు చేస్తుందమ్మా. మన కర్తవ్యమేమిటో తెలియజేస్తుంది, అందుకూ"

ఆ జవాబు ఆమెలో మరింత జిజ్ఞాస పెంచింది. చదివించింది. అన్ని జంతువుల్లోనూ అనాకారి కదా కోతి. అది ప్రధాన పాత్రగా నడిపించే భాగానికి 'సుందరకాండ' అని పేరు పెట్టడంలో కొన్నాళ్ళకి అంతరార్థం గ్రహించగలిగింది ఆమె. ఇందులో ఇంతుందా! అని ఆశ్చర్యపోయింది.

"పైకి మనకి కనపడే ఆకృతి అంత ముఖ్యమైంది కాదు. నీ లోపలి శక్తి ఏమిటో నువ్వే ప్రయత్నించి తెలుసుకో. నీ శక్తి తెలిశాక ఇక ఆగకు. ఏ లాభ నష్టాలు ఎదురైనా చలించక నువ్వు అనుకున్నది చేసి తీరాలి. లే విజృంభించు" ఎంతటి నాస్తికులైనా ఇలాంటి తర్కాన్ని కాదనడం కష్టం అనిపించింది.

అంతే. నిమిషాల మీద ఆమె ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఎగిరిపోయింది.'నేను అనాకారిని. బీదదాన్ని ఆడదాన్ని నా బతుకు వృథా' అనుకోవడం ఆ క్షణం నుంచి మానుకుంది. ఒక రోజ్జుట్టైముందని తెలిసినా, అప్పటికప్పుడు అన్ని సర్టిఫికేట్సూ అతి కష్టంమీద సంపాదించి వాల్తేరు వెళ్ళి మెట్రిక్‌కి అప్లయిచేసి వచ్చింది. ఆ తరవాత పది రోజుల నాటి మాట:

మాలతీ చందూర్ 'ఆలోచించు' కనకం దగ్గిర ఉందని తెలిసింది. వెంటనే వెళ్ళింది వాళ్ళింటికి. చూస్తూనే కనకం.

"ఏమే, ఎక్కడికి పోయావ్? ఏ మగాడి వలలో అయినా పడలేదు కద!" అనడిగింది.

"ఆడపుట్టుక పుట్టాక మరో వలలో పడే అవకాశం లేదు కద మనకి!

"అమ్మో! అంత వరకూ వచ్చిందా వ్యవహారం! ఎవడే ఆ కట్ త్రోట్?"

"కట్ త్రోట్ అవునో కాదో కాని నా త్రోట్ చుట్టూ పుస్తె కడతానని కూచున్నాడు!"

ఇక కనకాన్ని పూరించకుండా కాంతం జరిగిన విషయం చెప్పింది.

తను మెట్రిక్ కడుతోంది. నాన్న తెలుగు చెప్పగలడు. తనకి లెక్కలు వచ్చు. పక్క వీధి బి.ఇ.డీ. టీచరు సోములు ఫ్రీగా, ఇంగ్లీషు చెబుతానన్నాడు. అతని పెళ్ళైన ఆర్నెల్లకి వాళ్ళిద్దరికీ స్మాల్‌పాక్స్ వచ్చి, పెళ్ళాం పోయిందిట. ఎంతో కల్చర్ ఉన్నవాడు. ఈ ఇరవై రోజుల్లోనే వాళ్లెంతో సన్నిహితులు అయిపోయారు. ఇంగ్లీషు ఎవరైనా చెప్పొచ్చు. కాని ఈ పాటి ఇంగితం ఉన్న వాళ్ళు ఎక్కడో కాని జతపడరంటూ కాంతం ముగించింది.

"సెభాష్! ఆ స్ఫోటకం మచ్చల గుంటనక్కగాడు తప్ప మరెవరూ దొరకలేదూ నీకు! ఆముదాలవలస అంజిగాడని అంతకు మించిన అందగాడొకడు అదే పనిగా తిరుగుతున్నాడు, కబురంపించనా!"

కనకం అలా వెటకారం చెయ్యకపోతే కాంతానికి అంతటి పట్టుదల రాకపోనేమో! లేచి ఒక్క విసురున వెళ్ళిపోయింది. ఆ వెళ్ళడం వెళ్ళడం సోములింటి దగ్గిర ఆగింది.

కాంతానికి గుళ్ళో పెళ్ళైందని తెలిసీ తెలియగానే ఇక కనకం తల్లిని పట్టుకోవడం కష్టమైపోయింది! పూటకి గతి లేని అనాకారి టకీమని చేసుకుంది. నీకు మాత్రం కల్యాణరేఖ లేదు. ఇల్లరికం ఉండి ఇక్కడి వ్యాపారం చూసుకుంటామని వస్తున్నా కొట్టి పారేస్తున్నావు. నువ్వు ఒప్పుకోపోయావో....

కేవలం బెదిరించడం కాదు ఆవిడ నిజంగా నూతిలో పడింది. వచ్చిన దాన్ని కాదనలేక పోయింది కనకం. ఆ నెలాఖరుకి పెళ్ళయిపోయింది.

పెళ్లైన అయిదో నెలలో కాబోలు ఒకసారి వాళ్ళిద్దరూ కలుసుకున్నారు.

" మన మన భర్తలు ఎలాంటివారో ఒకరి కొకరు, చెప్పుకుందామే!" అంది కనకం.

"తమ తమ భార్యలు ఎలాంటి వాళ్ళో వీలైతే వాళ్ళూ చెప్పుకుంటారేమో!"

"అంటే నీ ఉద్దేశం? మాస్టారుగారేదో మందు పెట్టినట్టు మాటాడుతున్నావే అప్పుడే!"

"అదేం కాదు గాని, నే చెప్పిందేమిటో జాగ్రత్తగా విను. ఆడాళ్ళం మనమేదో అన్యాయానికి గురైపోతున్నామని అనుకునే ముందు ఆ దోపిడీ ఏమిటో స్పష్టంగా తెలియాలి. ఉద్రేకంతో పెద్ద గొంతుకతో అరిస్తే అబద్ధం నిజంగా మారదు. జీవితం అనేది తెలుపు నలుపుల కలనేత వస్త్రం అంటుంది భారతం. మనిషి స్వభావం మంచి చెడ్డల మిశ్రమం. ఇందులో ఆడా మగా తేడా కాని, జనరలైజు చేయగల ఏక పక్ష సత్యంకాని నా కిప్పటి వరకూ సంసారంలో ఎదురవలేదు. అంతే!"

"ఇన్నాళ్ళూ మా ఇంటికి వచ్చి మౌనంగా విన్నదీ, నేను కొనిచ్చిన నవలా సారం ఒంట పట్టించుకున్నది ఇదేనుటే, కాంతం? మాస్టారుగారు గొప్ప పాఠమే చెప్పినట్టున్నారులే! ఇలా లోకువివ్వబట్టే మగాళ్ళు మనల్ని అణిచేస్తున్నారు. పోనీ ఇప్పటి రచనలు వదిలేసి మీ నాన్న బోధించిన గ్రంథాలే తీసుకుందాం. నాటి పురాణాలే నేటి నవలలు. ఏం ఘోషిస్తున్నాయి అవి? స్త్రీ శక్తి స్వరూపిణి అని.

మొన్న మేం హనీమూన్‌కి కలకత్తాకి వెళ్ళొచ్చాం గుర్తుందా? ఎప్పుడు? దసరాలకి. అప్పుడు చూశాను. దుర్గా పూజ అంటే ఎలా ఉంటుందో?"

కనకం ఆ దృశ్యాన్ని కాంతం కళ్ళకు కట్టినట్టు వివరించింది. ఏ ఇందిరా గాంధీయో వచ్చి ఉపన్యాసం ఇచ్చినప్పుడు నిర్మిస్తారే అంతటి ఎత్తైన విశాలమైన వేదిక, దానికి ముందుగా కుడి, ఎడమల మామూలు మనిషి సైజులో లక్ష్మి, సరస్వతీ, వినాయకుడూ, కుమారస్వామీ విగ్రహాలు ఉంచుతారు. వీటికంటె ఇంచుమించు నాలుగింతల సైజులో అందలేనంత ఎత్తులో మధ్యగా దుర్గ విగ్రహం ఉంచుతారు. ప్రత్యేక అలంకరణతో, సమస్త బాహువులతో, ఆయుధాలతో మృగవాహనయై, మహిషాసుర మర్దనియై నవరాత్రుల పూజ అశేష జనం చేతా అందుకుంటూ ఉంటుందిట ఆ శక్తి స్వరూపిణి. దిక్కుమాలిన పురుష ప్రపంచం ఆ పాటి ఉన్నత స్థానం అయినా ఇవ్వద్దుటే ఆడదానికి?" కనకం వేసిన ఆ ప్రశ్నకు పక్కున నవ్వొచ్చింది కాంతానికి. నిజంగా అన్యాయమే జరిగితే, అలాంటి మగాణ్ణి చీల్చి చెండాడడానికి చిహ్నమే దుర్గవిగ్రహం. కాని ఆ స్థాయికి చేరడానికి ఆమెకున్న అర్హత? మణుల స్థావరమైన మహాధనికుడు హిమాలయుడి కూతురు పార్వతి. బూడిద పూసుకున్న బికారిని వలచింది, తపస్సు చేసి, పరీక్షలకు నిలిచి గెలిచింది. మొగుడికి అవమానం జరిగితే ప్రాణాలే విడిచింది. వ్యక్తిత్వం నిలబెట్టుకుని ముగురమ్మల మూలపుటమ్మ అయికూచుంది. ఏ క్వాలిఫికేషన్సూలేకుండా, ఎక్కడో ఏవో విని, ఎదిరించే శక్తి అనుకుని, దానిని గుర్తించని భర్తదే ఆ నేరం అనుకుంటే, ఆ సంసారాన్ని ఇక ఆ ఆదిశక్తే రక్షించాలి!

★